క్లుప్తంగా

నేడు జిల్లాస్థాయి వర్క్‌షాపు

చిట్యాల: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా స్థాయి వర్క్‌షాపును శనివారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య హాజరవుతారన్నారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నర్సరీ పరిశీలన

తిప్పర్తి : మండల కేంద్రంలోని నర్సరీని శుక్రవారం ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని నర్సరీల్లోని బెడ్లలో విత్తనాలు నాటాలన్నారు. వేసవిలో మొక్కలను సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వానాకాలం సీజన్ నాటికి నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట తిప్పర్తి కార్యదర్శి నర్సింహస్వామి ఉన్నారు.

శివలీలారెడ్డికి అవార్డు



అవార్డు అందుకుంటున్న శివలీల

కనగల్ : మండల కేంద్రానికి చెందిన డాక్టర్ శివలీలారెడ్డి చేస్తున్న సామాజిక సేవలకు గాను నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ అవార్డు శుక్రవారం హైదరాబాద్‌లో అందజేశారు. మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్ ఓకులాభరణం కృష్ణమోహన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేరేళ్ల మాలాద్రి చేతుల మీదుగా శివలీల అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి గజమాలతో సత్కరించారు.

మూడు గొర్రెలు చోరీ

చిట్యాల: మండలంలోని వెంబాయి గ్రామంలో గురువారం రాత్రి మూడు గొర్రెలు చోరీ అయ్యాయని ఆ గ్రామస్తులు తెలిపారు. వివరాలు..గ్రామానికి చెందిన ఆదె శంకరయ్య తనకున్న కొట్టంలో గొర్రెల మందను రోజు మాదిరిగానే ఉంచి ఇంటికి వచ్చాడు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి మందలోని మూడు గొర్రెలను ఎత్తుకెళ్లారు.

చర్చి పండుగకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

కేతేపల్లి: మండలంలోని భీమారం గ్రామంలో గల ఏసు తిరుహృదయ చర్చిలో ఈ నెల 25న నిర్వహించనున్న వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే వేముల వీరేశంను నకిరేకల్‌లో శుక్రవారం చర్చి కమిటీ ప్రతినిధులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ డి.జోసఫ్, మాజీ సర్పంచ్ బడుగుల కవిత నరేందర్, చర్చి కమిటీ ప్రతినిధులు కిలిబిస్, శౌరీలు, అనిల్, జయరాజు, మెల్కిరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

తిప్పర్తి : మండలంలోని జొన్నగడ్డలగూడెం గ్రామానికి చెందిన నర్సింగ్ ప్రభాకర్ మండలంలోని దుప్పలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ప్రభాకర్ మృతిచెందాడు. ప్రభాకర్ మృతదేహాన్ని తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్ అంత్యక్రియల నిమిత్తం కాంప్లెక్స్ ఉపాధ్యాయులు రూ 20వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుశీల, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు ..

చండూరు : మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు భిక్షమయ్య మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్ రెడ్డి శుక్రవారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, నాంపల్లి చంద్రమౌళి, మల్లం మహేష్, లింగయ్య, వెంకటేశ్వర్లు, భిక్షం, లింగస్వామి, సైదులు, నాగరాజు యాదయ్య పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

మునుగోడు: స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మునుగోడులో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ఈ శిబిరంలో చండూరుకు చెందిన వారికి మాత్రమే వైద్యులు కంటి పరీక్షలు చేస్తారన్నారు. చండూరు నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సులు

- ఉచిత బస్సు ప్రయాణానికి దూరమవుతున్న మహిళలు
- గ్రామీణ ప్రాంతాల్లో ఆటోలే దిక్కు
- వినతులు అందించినా పట్టించుకోని అధికారులు



కనగల్: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో పట్టణాలు, పల్లెల్లో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అయితే కనగల్ మండలంలో పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో మహిళలు ఈ పథకానికి దూరమవుతున్నారు.

బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా..

కనగల్ మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలపైనే ప్రయాణికులు ఆధారపడి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడపాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కనగల్ మండలంలో ప్రధాన రహదారులపై ఉన్న పర్వతగిరి, బుడుమర్లపల్లి, జి ఎడవెల్లి, కురంపల్లి గ్రామాలు మినహా ఏ గ్రామానికీ ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. గతంలో నల్లగొండ నుంచి దర్వేశిపురం, దోరేపల్లి, పగిడిమర్రి, శాబ్దుల్లాపురం కురంపల్లి చండూరు మీదుగా బస్సు సర్వీసులు నడిచేవి. అదేవిధంగా నల్లగొండ నుంచి ఇరుగంటిపల్లి చిన్న మాదారం గ్రామాలకు బస్సు సర్వీసులు ఉండేవి. ఇప్పుడు ఆ గ్రామాలకు బస్సు సర్వీసులు ఆర్టీసీ అధికారులు నడపడం లేదు. బస్సులు లేక ఆటోలు, ద్విచక్ర వాహనాలే ప్రయాణికులకు, విద్యార్థులకు దిక్కయ్యాయి. మండలంలో ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు సర్వీసులు లేవు.

గ్రామీణ మహిళల ఇబ్బందులు..

గతంలో నల్లగొండ బస్టాండ్ నుంచి పలు గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండేది. బస్సులకు సరియైన ఆక్యుపెన్సీ రావడం లేదని నిలిపివేశారు. కనగల్ మండలం నుంచి జిల్లా కేంద్రానికి రోజూ వేలాది మందికిపైగా విద్యార్థులు, గ్రామస్తులు వెళ్తుంటారు. వారంతా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. కనగల్ మండలంలోని గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో కొంతమంది మహిళలు ఆటోలను ఆశ్రయించగా, మరి కొంతమంది ప్రధాన రహదారుల వరకు నడుచుకుంటూ వెళ్లి అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి బస్సులపై చేరుకుంటున్నారు.

ఆటోలో ప్రయాణంతో నిత్యం ప్రమాదాలే..

కనగల్ మండలంలో వివిధ గ్రామాలకు పదుల సంఖ్యలో ఆటోలు నిత్యం తిరుగుతుంటాయి. మితిమీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే పోలీసులు ఇతర అధికారులు ఆటోలపై ఆంక్షలు పెట్టి హడావుడి చేస్తున్నారు తప్ప తరువాత పట్టించుకోవడం లేదు. అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకుని మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

ఆటోలోనే ప్రయాణం చేస్తున్నాం



మా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఆటోలోనే ప్రయాణం చేస్తున్నాం. ఆటోలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో ఇబ్బంది పడడమే కాకుండా ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయపడాల్సి వస్తుంది. అదే బస్సులో ప్రయాణం చేయాలంటే మా గ్రామం నుంచి దర్వేశిపురం, జి చెన్నారం గ్రామాలకు ఆటోలో వెళ్లి బస్సు ఎక్కాలి.

–రాపోలు సోమేశ్వరి, శాబ్దుల్లాపురం

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మునుగోడు : బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థితో రాయిస్తున్న కలెక్టర్

మునుగోడు: ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. శుక్రవారం మునుగోడులోని కస్తూరిబా గాంధీ పాఠశాల, బీసీ బాలుర హాస్టల్, మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో అందుబాటులో లేని బీసీ బాలుర హాస్టల్ వార్డెన్‌తోపాటు కస్తూరిబా ప్రత్యేక అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు.

పాఠాలు బోధించి.. ప్రశ్నలు అడిగి..

కస్తూరిబా పాఠశాల విద్యార్థినులకు దాదాపు అరగంట పాటు కలెక్టర్ పాఠాలు బోధించారు. విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి సరైన సమాధానం చెప్పిన విద్యార్థినికి చాక్‌లెట్లు అందించినది. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ప్రభుత్వ భూములకు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. కలెక్టర్ వెంట చండూరు ఆర్‌డీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఎం. నరేందర్, ఎంపీడీఓ శాంతకుమారి, ఆర్‌ఐ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాతా శిశు మరణాలకు కారణాలు విశ్లేషించాలి

నల్లగొండ: మాతా శిశు మరణాలు సంభవించడానికి గల కారణాలను విశ్లేషించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మాతా, శిశు మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మాతా శిశు మరణాలను అరికట్టడంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలది కీలకపాత్ర అన్నారు. సీడీపీఓలు దేవరకొండ ప్రాజెక్టుపై ఎక్కువ దృష్టి పెట్టి ప్రతినెలా ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది సమావేశాలు నిర్వహించి గర్భిణులకు అన్ని విషయాలపై కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వందన, స్వరూపరాణి, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, వైద్యాధికారులు, సీడీపీఓలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మున్సిపాలిటీ శివారులోని 7వ వార్డు బాబాసాహెబ్‌గూడెంలో శ్రీముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠ, అమ్మవారు, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ లింగాల మల్లీశ్వరి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తండు మమతసైదులు గౌడ్, వంటిపాక సరోజ శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు సల్లోజు శ్రీనివాస్, భూపతి వెంకటనారాయణ, భూపతి శ్రీనివాస్, చెవుగోని వీరస్వామి, వరికుప్పల నాగరాజు, శిరస్సు, నాగరాజు, తిరుమలేష్, సైదులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో..

బాబాసాహెబ్‌గూడెంలోని ఎస్సీకాలనీలో శ్రీముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ తండు మమతసైదులుగౌడ్, వంటిపాక సరోజ శ్రీనివాస్, ఏసోబు, ఎదుళ్ల వెంకటరమణ, శ్రీనివాస్, వంటిపాక అంబేద్కర్, బాలరాజు, వెంకన్న, మోహన్, జీవన్‌కుమార్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

నకిరేకల్ : నల్లగొండలోని శ్రీ రామానంద తీర్థ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న తిప్పర్తి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 410 మంది విద్యార్థులను ఈ పరీక్ష కేంద్రానికి కేటాయించామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను గంట ముందు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. హాల్ టికెట్, బాల్ పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్, తీసుకుని రావాలని సూచించారు.

నాటుకోళ్లు మృత్యువాత

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తిలో ఓ ఇంట్లో పెంచుకుంటున్న తొమ్మిది నాటుకోళ్లు శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందాయి. నాలుగు రోజులుగా గ్రామంలో పలువురి నాటు కోళ్లు ఇలాగే మృతి చెందుతున్నాయి. పశు వైద్యశాఖ అధికారులు పరిశీలించి కోళ్లు మృత్యువాత పడకుండా తగిన సూచనలు చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

బ్యాలెట్ పేపర్లపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: ఖమ్మం–నల్లగొండ –వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తున్నందున పీఓ, ఏపీఓ, సెక్టోరల్ అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అదనపు రిటర్నింగ్ అధికారి జే.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్లో పీఓ, ఏపీఓ, సెక్టోరల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్స్‌లు ఎలా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ అశోక్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక హజరత్ సయ్యద్ ఉర్సు



దర్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

మునుగోడు: మతసామరస్యానికి ప్రతీకగా హజరత్ సయ్యద్ ఉర్సు నిలుస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఇప్పర్తి, కోతులారం గ్రామాల మధ్యలో హరత్ సయ్యద్ దర్గా ఉత్సవాల్లో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ దర్గాను ప్రభుత్వం గుర్తించి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఉర్సుకు హాజరయ్యే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ ఉర్సులో బొడిగే అశోక్ గౌడ్, పూల వెంకటేషం, జాజుల వెంకటేషం, నల్ల నాగిరెడ్డి, గుర్జ నర్సింహ, జాజుల రవీందర్, కందుల ప్రభాకర్, మేకల గోపాల్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



వివిధ రకాల వేషధారణలో విద్యార్థులు

కేతేపల్లి: మాతృభాష పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటు పడాలని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.భిక్షమయ్య అన్నారు. మండలంలోని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులు, ఉపాధ్యాయులు కవి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాపోలు రమేష్, బత్తుల జానకిరెడ్డి, జి.రమేష్, కన్నె శివయ్య, ఎల్.శ్రీధర్, డి.నాగయ్య, సుమన్ పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మాతృ భాషా గొప్పతనంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం పాఠశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ అక్క, పిట్టలదొర, గౌడ భటులు వంటి వేషధారణలతో విద్యార్థులు అలరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గీత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు, హిందీ భాషోపాధ్యాయులు చంద్రశేఖర్, బాలయ్య, ఉపాధ్యాయులు నహీముద్దీన్, సాయిబాబా, మాధవి, నవ్య, సుశ్విత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటరు గెలిచినట్లు



మాట్లాడుతున్న చావా రవి

నల్లగొండ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలిస్తేనే.. ఓటర్లు గెలిచినట్లవుతుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. నర్సిరెడ్డి తప్ప ఇంకెవరు గెలిచినా అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని అన్నారు. శుక్రవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, నలపరాజు వెంకన్న, నర్రా సరళ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

మునుగోడు: మండలంలోని చల్మెడ గ్రామంలో గల ఓ కిరాణ దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా శుక్రవారం మునుగోడు పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్‌ఐ ఖలీల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన కర్నాటి యాదమ్మ కిరాణం షాపులో మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ వ్యక్తులు ద్వారా సమాచారం అందింది. పోలీసులు వెళ్లి సోదా చేయగా ఆ దుకాణంలో దాదాపు రూ.10 వేల విలువ గల మద్యం పట్టుబడింది. ఆ మద్యాన్ని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆమెపై కేసు నమోదుచేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బాబురావుకు సత్కారం

చిట్యాల: హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో గురువారం రాత్రి మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిట్యాలకు చెందిన సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు బాబురావును డాక్టరేట్‌తో సత్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ఆదినారాయణ, రిటైర్డ్ జడ్జి మాల్యాద్రి ముఖ్య అతిథులు గా హాజరై బాబురావుకు డాక్టరేట్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి జెడ్పీహెచ్ఎస్‌లో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు ఆనాడు తమకు చదువుచెప్పిన హెచ్‌ఎం కంచర్ల మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కొండకింది అంజిరెడ్డి, నీలం రెడ్డి, కేవీవీ ఆచార్య, దూదిగామ స్వామి, నర్రా శేఖర్‌రెడ్డి, శ్రీరాములుకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మేడి శ్రీనివాస్, నర్రా వెంకటేశ్వరరెడ్డి, ఎదుళ్ల నాగరాజు, నర్రా నరేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మేడి వీరాస్వామి, బట్టు అయిలేష్, దూదిగామ స్వామి, మంజుల, స్వప్న, పద్మ, స్వరాజ్యం, సబిత తదితరులు పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలని ప్రచారం

కట్టంగూర్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి సరోత్తంరెడ్డి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని నకిరేకల్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్, హైదరాబాద్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. వరంగల్–ఖమ్మం–నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం కట్టంగూర్‌లో ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలం నాగరాజు, కోమటి భాస్కర్, చెరుకు నాగరాజు, గున్నాల నాగరాజు, బత్తిని నాగరాజు, గంజి ఆంజనేయులు, కంబాలపల్లి సైదులు ఉన్నారు.

రెండు పాడి గేదెలు అపహరణ

మునుగోడు: మండలంలోని కచలాపురం గ్రామంలో గురువారం రాత్రి ఓ రైతుకు చెందిన రెండు పాడిగేదెలు అపహరణకు గురయ్యాయి. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గుర్జ ఎల్లయ్య రోడ్డు పక్కనే ఉన్న తన వ్యవసాయ బావి వద్ద తన పశువులను రోజూమాదిరిగానే కట్టేశాడు. దుండగులు అర్ధరాత్రి సమయంలో ఓ ఆటోలో వచ్చి రెండు గేదెలను ఎత్తుకెళ్లారు. ఎప్పటిలాగే ఉదయాన్నే పాలు పిండేందుకు వెళ్లగా రెండు గేదెలు కనిపించకపోవడంతో ఎల్లయ్య చుట్టుపక్కల వెతికాడు అయినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అపహరణకు గురైన పాడిగేదెల విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందని రైతు తెలిపాడు.

గోమాతకు జన్మదిన వేడుకలు



గోమాతకు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న సైదాచారి

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలో బైరోజు సైదాచారి తాను పెంచుకుంటున్న గౌరి అనే పేరు గల గోమాతకి శుక్రవారం జన్మదిన వేడుకలు నిర్వహించారు. పలువురితో కలిసి గోమాతకు పూజలు చేశారు. గోమాత జన్మదినం సందర్భంగా సుమారుగా మూడు వందల యాభై మందికి అన్నదాన చేశారు. కార్యక్రమంలో పాశం శ్రీనివాస్‌రెడ్డి, జేరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, దూదిమెట్ల సత్తయ్య, వేముల వెంకన్న, వేముల సత్తయ్య, భాస్కర్‌రెడ్డి, అజీజ్, మట్టిపల్లి శ్రీను, వెంకటాచారి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తిప్పర్తి : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ద్రోణార్జున శుక్రవారం బాధ్యతలు స్వీకరించారని తిప్పర్తి తహసీల్దార్ స్వప్న తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్‌ఐ బదిలీపై వెళ్లగా నూతన ఆర్‌ఐగా ద్రోణార్జున విధుల్లో చేరారు.

ఉడ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మర్రిగూడ : మండలంలోని సెయింట్‌మేరీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో అండర్–14 ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి ఉడ్‌బాల్ పోటీలను శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ పులి రాజు, ప్రిన్సిపాల్ జంగిడి ఝాన్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉడ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.రహమత్, పీఈటీ మేడిపల్లి నవీన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో కె.శ్యామ్‌సందీప్, జి.మన్విత్, కౌశిక్‌రెడ్డి, మనీంద్ర, నిచ్చాల్, భ్రవన్, విఘ్నేష్, పవన్‌లు ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్ర ఉడ్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నవీన్, గణేశ్, తరుణ్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ అవార్డు అందుకున్న అంజయ్య

నల్లగొండ: సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య చేసిన సేవలను గుర్తించి మనం ఫౌండేషన్ వారు హైదరాబాద్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజారావు కళామందిరంలో శుక్రవారం రాత్రి జగ్జీవన్ రామ్ జాతీయ అవార్డు అందజేశారు. జిల్లాలో ఫ్లోరిన్ రహిత మంచినీళ్లు కావాలని జలసాధన ఉద్యమంలో భాగంగా 40 సంవత్సరాలుగా శాంతియుత పోరాటాల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. ఆయన సేవలు గుర్తించి ఫౌండేషన్ వారు బీసీ కార్పొరేషన్ చైర్మన్ ఓకులాభరణం కృష్ణమోహన్‌రావు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి నేరెళ్ల మాలాద్రి ఈ అవార్డు అందజేశారు. అంజయ్యను నిర్వాహకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి, రేవతి శర్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న బండమీది అంజయ్య

ముగిసిన ఆపదమిత్ర వలంటీర్ల శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నల్లగొండ: జాతీయ విపత్తు ప్రతిస్పందన, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాల ఆధ్వర్యంలో 100 మంది ఆపదమిత్ర వలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన మొదటి విడత శిక్షణ కార్యక్రమం ముగిసిన సందర్భంగా శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఆర్‌ఎఫ్, జిల్లా ఫైర్, అటవీ, వైద్య, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మత్స్య, ఇంజనీరింగ్ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. మంటలు, వరదలు, భూకంపాలు విపత్తుల నిర్వహణ, ప్రతిస్పందన తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని రక్షించడం, ప్రథమ చికిత్స వంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ శిక్షణ మేనేజర్ డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్డీఐటీ పి.వెంకటేశ్వర్లు, డీపీఎం మోహన్‌రెడ్డి, ప్రభాకర్, విష్ణువర్ధన్, జయ, వెంకన్న పాల్గొన్నారు.

నర్సరీలపై నిర్లక్ష్యం తగదు

మర్రిగూడ : నర్సరీల్లో పెంచే మొక్కలపై స్థానిక అధికారుల నిర్లక్ష్యం తగదని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి నర్సరీని ఆయన పరిశీలించి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, వన సేవకులకు పలు సూచనలు చేశారు. ప్రతి నర్సరీలో ఏడు కేటగిరిలుగా మొక్కలు ఉండాలన్నారు. నర్సరీల పర్యవేక్షణ కోసం నవంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేకాధికారుల బృందం పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చినమునయ్య, ఎంపీఓ బి.రవికుమార్, ఇన్‌చార్జి ఏపీఓ వివేక్, టీఏలు సత్యనారాయణ, నర్సింహతోపాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలు బహూకరణ

శాలిగౌరారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌కు 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి వస్కుల శ్రవణ్ రూ.10 వేల విలువ కలిగిన కుర్చీలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

కట్టంగూర్ : మండలంలోని పందెనపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ సహకారంతో ఫ్లయింగ్ ఈగల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ప్రథమ బహుమతి గెలుచుకున్న కట్టంగూర్ టీంకు రూ.30వేలతో పాటు కప్, ద్వితీయ బహుమతి గెలుచుకున్న పందెనపల్లి టీంకు రూ.15వేలు నగదుతో పాటు కప్, తృతీయ బహుమతి గెలుచుకున్న ఈదులూరు టీంకు రూ.7500 నగదుతో పాటు కప్‌ను నలగాటి ప్రసన్నరాజ్ అందజేశారు. ఊట్కూరి ఏడుకొండలు, నూక సైదులు, ముప్పిడి యాదయ్య, రాజిరెడ్డి, రమేష్, మల్లేష్‌గౌడ్, నర్సింహ, సుధాకర్, నాగరాజు, మహేష్, రుక్కమ్మ, సోమయ్య, సునీల్ పాల్గొన్నారు.